# ఆత్మానుభూతి

వాణి-1985

మనస్సు కార్చే కన్నీళ్ళను తుడుస్తుంది కళ.

—జయప్రద

మేడమీద ఆ పెద్ద హాలులో అడుగుబెడుతున్న కరుణాదేవి కళ్ళు చెదిరేలా ఎదురుగా నిలువెత్తు నటరాజు విగ్రహం. నేలంతా పరుచుకున్న మెత్తటి పచ్చటి కార్పెట్. ఓ మూలగా కుషన్ సోఫా సెట్...

గోడలకంతా అందమైన పెయింటింగ్స్. ఆ హాలు సౌందర్యానికి తాదాత్మ్యం చెందుతున్న నలభై సంవత్సరాల్ల కరుణాదేవి తృళ్ళిపడింది.

"ప్లీజ్! ప్లీజ్! కర్పూరా గట్టిగా అరవకు. ఆమెవింటారు హాలులో వున్నారు."

"మీకు నేను గొంతు చించుకొని చెపుతున్నాను. నాకా తైతక్కలాటలు ఇష్టం లేదు."

"అది తైతక్కలాటా? డాన్స్ ఒక కళ కర్పూరా!"

"కళా పాడా! మనమ్మాయి డాన్స్ నేర్చుకుని పాఠాలు చెప్పుకుని బ్రతకాలా? ప్రదర్శనలిచ్చి బ్రతకాలా?"

"కళ మనోవికాశం కోసం కర్పూరా! బ్రతకటానికే కాదు."

హాల్లో కూర్చున్న కరుణాదేవి నవ్వుకుంది.

కళ కళకోసమే అంది అమ్మ ఆరోజు. కానీ....తను....తను ఈరోజు ఆ కళతోనే పొట్టపోసుకుంటూంది.

"కర్పూరా! కాదనక. చూడు నా చిత్రకళ మూలపడిపోయింది. బిజినెస్‌లో క్షణం తీరికలేదు. మనసు మాత్రం వేయమని తొందర పెడుతోంది. తల్చుకుంటే నా అసహాయతకు నాకే దిగులేస్తుంది."

ప్రక్కరూమ్‌లో కరుణాదేవి నిట్టూర్చింది.

తెల్లకాగితంమీద కుంచె నడిపి ఓ చిత్రాన్ని సృష్టించినపుడు ఆ చిత్రకారుడికి ఏమి తృప్తి కలుగుతుందో తనకు అనుభవంలేదు. మానసిక ప్రసవవేదన ననుభవించి ఓ కథను తయారుచేసి కలం మూసిన రచయిత ఏమి ఆనందాన్ననుభవిస్తాడో తనకు అనుభవంలేదు.

అర్థరాత్రి అశాంతి మేల్కొల్పినపుడు ఆ నిశీధిలో గాయకులు గొంతెత్తి పాడుకుని ఆ తర్వాత ఎందుకంత హాయిగా నిద్రపోతారో తనకు అనుభవంలేదు.

కానీ ఊహించగలదు.

ఎందుకంటే ఆనాడు అమ్మ తనను అర్థించినపుడు ఆమె కోసం ఒప్పుకున్న తను ఈరోజు తలుపులన్నీ మూసుకుని అద్దంముందు ఒంటరిగా నిల్చుని మనసులో స్వరం మననం చేసుకుని అధరాలతో సాహిత్యాన్ని ఉత్సరిస్తూ పాదాలతో భూమిమీద నర్తించేప్పుడు తనలో రేగే భావావేశం ఆ అనుభూతి తనకు కొత్తదా?

బిడ్డకు పాలిచ్చిన తృప్తి, తల్లి ఒడిలో పడుకున్న మనశ్శాంతి భక్తతోడున్న భ్రమ-

ప్రక్కరూములో నుండి కొద్ది పెద్దగొంతుతో వినవచ్చిన మాటలకు కించిత్ తృప్తిపడింది కరుణాదేవి.

"మిమ్మల్ని వేసుకోవద్దన్నానా? చిత్రకళకు డాన్స్‌కు తేడా లేదూ!

కావాలంటే నృత్యకు పెయింటింగ్ నేర్పించుకోండి లేదా సంగీతం నేర్పించుకోండి" చిన్నగా అతను నవ్విన శబ్దం.

"కళనేది జన్మగతం కర్పూరా! మన నృత్యకు డాన్స్ అంటే ఇష్టం.

గాత్రం నేర్పిద్దామంటే గొంతు శ్రావ్యంగా ఉండదు. ఏది ఎవరికిష్టమో అది నేర్పిస్తేనే కళ రాణిస్తుంది."

"నాకేం ఇష్టం లేదు, ఇక మీ ఇష్టం."

"పోనీ కళకోసం కాకపోయినా మంచి ఎక్సర్‌సైజ్ అనుకో. నృత్య బాడీ ఎప్పుడూ స్లిమ్‌గా ఉంటుంది."

"మీ ఇష్టమన్నానుగా" అందావిడ.

"నృత్యా! రామ్మా! టీచర్ వచ్చున్నారు. ఈ చీర, పళ్ళిచ్చి కాళ్ళకు దండం పెట్టి పాఠం మొదలెట్టాలి."

"ఆ పొట్టపోసుకోవటానికి వచ్చిన వాళ్ళకు దండాలొకటి. ఏమక్కరలేదు. అవివ్వేసి పాఠం మొదలెట్టమను" ఆమె విసురుగా క్రిందకెళ్ళింది.

"అమ్మ మాటలకేంలేమ్మా నువ్వెళ్ళమ్మా. వెళ్ళి గురువుకు నమస్కరించు గురువుమీద భక్తిలేందే విద్యలో ప్రావీణ్యత రాదు."

వాళ్ళ మాటలన్నీ వాళ్ళెంత చిన్నగా మాట్లాడినా ఆ గోడకానుకొని కూర్చున్న కరుణాదేవికి వినిపిస్తూనే వున్నాయి.

ఆమె వాళ్ళ మాటలకు పొంగిపోనూ లేదు, కించపడనూ లేదు.

సరిగ్గా పాతికేళ్ళ క్రితం అమ్మ తనని ప్రతిమిలాడి నృత్యం నేర్చుకోమన్నప్పుడు - తను మాత్రం ఏమంది?

'ఒళ్ళంతా కన్పించేలా ప్రదర్శనలివ్వడం తనకిష్టంలేదంది. ఒకవేళ నేర్చుకున్నా ప్రదర్శనలమాట సరికదా నువ్వుకూడా డాన్స్ చేయమని అడక్కూడదు' అంది.

పసితనపు అమాయకత్వమో-తనకు తల్లీ దండ్రీ అంతా వున్నారనే గర్వాహంకారమో ఏది ఏమైనా ఆనాడు అమ్మను తను చాలా వేధించింది.

"కరుణా! నా కోరిక్క కాదనకు, నాకు నేర్చుకోవాలని ఎంతిష్టమో!

కానీ మా తాతగార్కి నా కోర్కె కోసరం సంవత్సరానికి కొన్ని వందలు ఖర్చుపెట్టే తాహతు లేకపోయింది.

స్కూల్లో ఎవ్వరు స్టేజి ఎక్కుతున్నా నా చేతిలో ఒక కళవుంటే ఇలా నిరుపయోగంగా కూర్చొనేదాన్ని కాదు కదా అనుకునేదాన్ని. నీలో అయినా ఆ కోర్కెను నన్ను తీర్చుకోనీ"అని పాపం ఎన్నివిధాల వేడుకుంది తనని ఒప్పించడానికి.

ఆనాడు ఏదో అమ్మనుద్ధరిస్తున్నాననుకుని ఒప్పుకున్నా ఈ కళ ఈనాడు తనకు అన్నం పెడుతోంది. తల్లీ, తండ్రీ, భర్తా, బిడ్డా అందరూ తనని ఒంటరిదాన్ని చేసి గతించిపోతే ఈ విద్య, ఈ విద్య ఒక్కటే తనకింత అన్నం పెట్టడమే కాదు మనోతృప్తినిస్తోంది. పిరికివానిలా ఆత్మహత్య చేసుకోకుండా తన్ను ముందుకు నడిపిస్తోంది.

'అమ్మ! అమ్మ! ఎక్కడుందో' కరుణాదేవి కళ్ళల్లో నీళ్ళు-ఆమె పాదాలమీద నృత్య హస్తాలు.

❋